


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

వరసగా రెండు కార్లు బయలుదేరినై. బిస్కెట్ పాకెట్లు, పాలపొడి పోట్లాలు, టీ సా చెట్లూ, ఓ కుంపటీ, బొగ్గులూ, సాంబ్రాణి పొట్లాలూ, అగరు వత్తులూ బోలెడు కొవ్వొత్తులూ, పవర్‌ఫుల్ టార్చిలైట్లు, కొన్ని మందులూ ఇంకా ఇంకా చాలా వస్తువులతో, దుస్తులున్న సూట్‌కేసులతో డిక్కీలు నిండిపోగా, కారుపైన కూడా లగేజ్ పెట్టి రాడ్స్‌కి కట్టి ప్లాస్టిక్ చేంతాళ్ళతో దిట్టంగా కట్టారు. మొదటి కార్లో ముందు సీట్లో కూర్చున్నది శాస్త్రిగారు. వెనక కూర్చున్నది రాబీ, జయ్, సుదర్శన్. రెండో కార్లో ముందు సీట్లో కూర్చున్నది శ్రీనివాస్. వెనక సీటు మొత్తం సామాన్లతో బేగ్‌లతో నిండి వుంది.

ఎండ భయంకరంగా వుంది. ఏసి వున్నా ఎండ ప్రతాపానికి కారు టాప్ అల్లాడిపోతూ, లోపలున్న జనాల్ని చికాకు పెడుతోంది.

"వేర్ ఆర్ వియ్ గోయింగ్" చికాగ్గా అడిగాడు రాబీ.

"మిస్టర్ రాబీ.. మీకు పూర్తిగా విషయాలు తెలీవు. చెప్పాలనే వుంది. చెపుతాను. అయితే మీరు ప్రశాంతంగా వినాలి. ఎందుకంటే, యీ ప్రయాణం జరుగుతున్నది మీ కోసమే. ఇంకా చెప్పాలంటే మీదో విచిత్రస్థితి ఒకానొక జన్మలో మీరు పుట్టింది తిరుపతిలోని ఓ బ్రాహ్మణ కుటుంబంలో" ఆగారు శాస్త్రిగారు.

"అవును.. ఇదేమాట విలియమ్స్ అన్నాడు.. అసలు విలియమ్స్ అనేవాడు నిజంగావుంటే" ఆశ్చర్యంగా అన్నాడు రాబీ.

"ఉండటమే కాదు కొన్ని రోజులపాటు, అంటే ఆల్ మోస్ట్ మూడువారాలపాటు నీ మనసు అతని ఆధీనంలోనే వుంది. బహుశా ఇంకొంత కాలమూ అతని ఆధీనంలోనే ఉండక తప్పదేమో? అది ఎందుకో మాకూ తెలీదు. ఇండియానీ ఇండియన్ కల్చర్‌నీ స్టడీ చేయడానికి వచ్చానని నువ్వు అనుకుంటున్నావు. అది నిజం కాదనీ, నువ్వో పనిమీద కొన్ని శక్తులవల్ల ప్రేరేపించబడి ఇక్కడి కొచ్చావనీ మాకు అర్థమయింది" ఆగారు శాస్త్రిగారు.

"నాకు అర్థం అయీ కానట్టు వుంది. ఇంకొంచెం వివరంగా చెప్పండి" కుతూహలంగా ముందుకి వొంగి అన్నాడు రాబీ. పకపకా నవ్వారు శాస్త్రిగారు.

"మాకు తెలిస్తేగా నీకు చెప్పడానికి. డియర్ రాబీ కాలం అనేదానికి దూరమూ, దగ్గరా, ప్రాంతము, రంగు, కులము మతము, వర్గము, వర్ణము అనే భేదాలు వుండవు. ఓ జన్మలో కుక్కగా వున్న జీవి మరు జన్మలో మనిషిగా పుట్టొచ్చు. గత జన్మలో మహమ్మదీయుడుగా పుట్టి  హిందువు హింసించిన వాడు, యీ జన్మలో హిందువుగా పుట్టి మహమ్మదీయుల్ని మట్టు బెట్టొచ్చు. కాలం దృష్టిలో భేదాలు లేవు. ఎవరు ఎక్కడ పుట్టినా ఏదో ఓ కారణం వుండి తీరుతుంది. కాలం మనిషికి

వేసే ప్రశ్నకి కాలమే జవాబు చెప్పాలి. అంతదాకా వేచిచూడటం తప్ప చేసేది ఏమీలేదు." వెనక్కి తిరిగి రాబీని చూస్తూ అన్నారు శాస్త్రిగారు.

"మరి యీ ప్రయాణం ఎక్కడికీ?"

"పలమనేరు వైపు వెడుతున్నాం. అక్కడ కౌండిన్య వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వుంది." జవాబిచ్చాడు జయ్

"ఎందుకూ?"

"మాకూ తెలీదు రాబీ.. ఇదిగో.. ఇతని పేరు సుదర్శన భట్టు. గవ్వలు వేసి భవిష్యత్తుని చెప్పటం ఇతనికి వంశపారంపర్యంగా వస్తున్న నిధి. అలాగే సమస్యలు వచ్చినప్పుడు ఎలా పరిష్కరించాలో తెలియకపోయినా, ఎటువైపు వెడితే పరిష్కారమవుతుందో కూడా యీ గవ్వలు సూచిస్తాయి. అందుకే గవ్వలు సూచించిన దిశకు వెళ్తున్నాము" వివరించాడు జయ్.

రాబీ ఆలోచనలో మునిగాడు. విమానం ఎక్కిన దగ్గరినించీ ఇప్పటిదాకా జరిగిన సంఘటనలను మరీ మరీ గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. మనసంతా మబ్బు మబ్బుగా వుండి ఏదోఈ స్పష్టంగా తెలియడంలేదు. ఆలోచించిన కొద్ది విపరీతమైన నిద్ర ముంచుకొస్తోంది. కళ్ళు మూసుకున్నాడు. ఏవేవో తెరలు.. ఎవరెవరో మనుషులు.. స్వప్నం లాంటి జాగ్రదావస్థ అది.

వారణాసి

ఇరుకు ఇరుకు సందులు. యధేచ్ఛగా తిరిగే గోవులు. జడలు గట్టిన శిరోజాలతో గడ్డాలతో కొల్లాయి గుడ్డలు, కాషాయ వస్త్రాలు, గోచీలు కట్టుకుని లోకం పట్ల కొంత విరక్తితోనూ, కొంత ఆసక్తితోనూ తిరుగుతున్న సన్యాసులూ, యోగులూ, ఆ రెండూ కాని భిక్షకులు, బికారులు.

ఒకో ఘాట్ వద్ద పదుల, వందల సంఖ్యలో గుమికూడిన ప్రజలు. ఓం నమశ్శివాయ, భం భం భోలే అంటూ మధ్య మధ్య అరుపులూ, ఫుల్ బిజినెస్ మూడ్‌లో వున్న పండాలు, ఆ పండాల దగ్గరికి యాత్రికుల్ని తీసుకుపోయే దళారీలు - కాశీ కళకళలాడుతూవుంది.

పగలంతా ఎంత జీవకళో రాత్రీ అంతే. అయితే రాత్రిళ్ళు సంచరించేవారు, మేలుకునేవారూ తెల్లార్లూ జపతపాలతో మునిగి తేలేవారూ ఇది మరో రకం వారు.

ఇక గంగానది. అదో దివ్య ప్రవాహం. జనన మరణాల అనంత పయనాన్ని కళ్లకు కట్టే కాల జ్ఞానమది. భారతదేశంలో పుట్టిన ప్రతి హిందువు అంతిమ గమ్యమూ కాశీక్షేత్రమే. నిర్వికారుడైన మహా శివునితో లయించి జన్మని ధన్యం చేసుకోవడమే.

డబ్బున్న మహారాజులు గుప్తదానాలు చేస్తారు. స్వచ్ఛమైన నేతితో తయారు చేసిన బూందీతో లడ్డూలు చుడుతూ వాటి మధ్య ఓ చిన్న బంగారు కాసో, వెండికాసో, అధమాధమంగా రాగి కాసో లేక రూపాయి, రెండు రూపాయిల బిళ్ళలో పెడతారు. లడ్డూలు చుట్టాక, ఏ లడ్డూలో ఏ లోహ ముందో ఎవరికి తెలుసు. అది దానాన్ని స్వీకరించినవారికి మాత్రమే తెలుస్తుంది.

"భాయీసాబ్.. ఏ ప్రషాద్ లీజియే" అంటూ ఓ శేఠ్‌జీ మీకో లడ్డూ ఇవ్వచ్చు. దాన్ని చిదిమితే బంగారమో, వెండో ఏదో ఓ నాణెం అందుతుంది. ఇచ్చేవాడికీ తెలీదు ఏమిస్తున్నాడో. పుచ్చుకునే వాడికీ తెలీదు ఏం పుచ్చుకుంటున్నాడో. దీన్నే 'గుప్తదానాలు' అంటారు. కాశీలో దానం చేస్తే పుణ్యం కోటి వంతులు పెరుగుతుందంటారు. కొందరు పుణ్యం కోసం చేస్తే, కొందరు పాపాల్ని ప్రక్షాళన చేసుకోవడానికి దానాలు చేస్తారు.

ఈ దానాల ఘోష ఒక ప్రక్క అయితే, ఆకలి ఘోష మరో ప్రక్క. రకరకాల భాషలవారు. "బాబా.. ఏక్ రుపయ్యా దేదో" అంటూ యాచిస్తూవుంటారు. ఆకలికి తనదైన భాష ఒకటుంది. ఆ భాష ప్రాంతీయ భాషో, జాతీయ భాషో కాదు. అది సమస్త దేశాల ప్రజలకూ అర్థమయ్యే భాష. అంది అందరికీ తెలిసిన ఏకైక భాష.

భక్తీ భయమూ కూడా అటువంటివే. చెప్పలేనన్ని సత్రాలు ఉచిత వసతి ఉచిత భోజనం కూడా సమకూర్చే సంస్థలు చాలా వున్నాయి. విపరీతమైన రద్దీతో నిండిన దుకాణాలూ తినుబండారాల షాపులు. యాత్రికుల సందడి సరేసరి.

రాత్రవుతుంది. చీకట్లు అలుముకుంటాయి. జనాలు తమ ఇళ్ళల్లోకో, వసతి గృహాల్లోకో, పెద్ద హోటల్సులోకో పోయి విశ్రాంతిలో మునుగుతారు.

స్నానఘాట్‌ల మెట్లమీద సెటిలైన సన్యాసులు ఆకాశాన్ని ర్ధనిమీలిత నేత్రాలతో కొలుస్తూ వుంటారు. ఎవరో గంజాయి చిలుము వెలిగించి, రెండు దమ్ములు గాఢంగా పీల్చి పక్క సాధువుకి ఇస్తాడు. చలిరాత్రిలో కొంత వెచ్చదనం అలుముకుంటుంది.

ఏ సాధువో ఓ పురాతన, యుగయుగాల గీతం ఎత్తుకుంటాడు. మహాసముద్రంలా కనిపించే నక్షత్ర సముద్రపు మధ్యలోకి ఆ ఆర్తి నిండిన మనోహర గీతం చొచ్చుకుపోతూ వుంటుంది. గంగ ఆ గానంతో పులకించి తన కెరటాలనే రెక్కలుగా మార్చుకుని రెపరెపలాడుతూ కంటికి కనపడని ఆ మహాశివుని నిశ్వాసంలా, మన శ్వాసల్లో ప్రవేశించి మనని మైమరపిస్తుంది. కళ్ళు మెల్లగా మూతపడతాయి. జాగ్రదవస్తనించి స్వప్నావస్త అక్కడ్నించి సుషుప్తికి పయనిస్తాం. అన్నీ కనుమరుగై కేవలం ఓ మహాశూన్యంలో ఒదిగిపోతాం. బస్. 'ముక్తి' అంటే అదేనా, తాత్కాలికమైనదేనా?

వెతుకుతూ వున్నాను వెతుకుతూ వున్నాను
నన్ను నేనే మరలా వెతుకుతూ వున్నాను.
పగలంత వెదికాను రాత్రిళ్ళు వెదికాను
చీకట్లో చీకటై వెతుకుతూ వున్నాను
నాకు నేనే అసలు దొరకలేదయ్యో - నువ్వు
దారైనా చూపవా కాశి లింగయ్యో"

ఆ పాటకి అర్థం తెలుసా బంధూ?" అడిగాడో సన్యాసి మరో యువసన్యాసిని.

"ఆకాకర కీకర భాష నాకు రాదు" చికాగ్గా అన్నాడు యువ సన్యాసి భోజ్‌పురిలో (భోజ్ పురి లిపిలేని బిహారీ భాష. హిందీ లిపిని వాడతారు. అత్యంత తీయనైన భాష అది.)

"ఆ భాష పేరు తెలుసు. నేను చాలా యేళ్ళున్నా ఆంధ్రాలో. అది శిథిలమయ్యే శరీరం, అమరమైన ఆత్మతో ఎలుగెత్తి పెట్టుకుంటున్న మొర. యుగయుగాల మనిషిలోని మనిషి వేదన. మానవుడు మాధవునితో, దయగాంచమని వేడుకుంటున్నపాట" మళ్ళీ మళ్ళీ వినిపిస్తున్న ఆ పాటని ఆస్వాదిస్తూ అన్నాను మొదటి సన్యాసి.

"అయితే అక్కడికే పో. నన్నెందుకు లేపుతావూ?" చికాగ్గా అన్నాడు యువసన్యాసి.

"సాధువలకి ఉండకూడినవి కోపం, చికాకులే" నవ్వాడు మొదటి సన్యాసి. "హూ.." హూంకరించాడు యువసన్యాసి.

"మెట్లలో ఉన్నాది గోడల్లో వున్నాది
లింగమై ఉన్నాది ఒక్కటే గదరా
అందరూ తొక్కేది అందరూ మొక్కేది
రూపు మార్చుకున్న రాయినే గదరా.
చదువు కున్నోళ్ళదే జ్ఞానమంటారు
చదువు రానోడిదజ్ఞానమంటారు
ఉంగరాన్నున్నదీ, కంకణాన్నున్నదీ
బంగార మొక్కటే గదరా - లింగయ్యా
ఏ భేదమూ లేదు కనరా"

మొదటి సన్యాసి లేచి తత్వాలు పాడుతున్న సన్యాసి దగ్గరికొచ్చాడు. దగ్గరి కెళ్ళాకే తెలిసింది ఆ పాడే అతను సన్యాసి కాదనీ పంచ చొక్కా చక్కగా కట్టుకున్న ముప్పై ఏళ్ళ యువకుడనీ.

"మీ పాట విన్నాను. చాలా బాగుంది. మంచి అర్థం కూడా." మెచ్చుకున్నాడు మొదటి సన్యాసి.

"అలాగే.. నేనే సరదాకి పాట కట్టి పాడుకుంటున్నాను. నిద్రేమో రావడంలేదు. రాత్రి గడవాలిగా" అన్నాడు గాయకుడు.

"ఈ చీకట్లో ఏదీ  కనిపించదు. సరే. చిలుము వెలిగిస్తా" చిలుము వెలిగిస్తూ గాయకుడి మొహం చూశాడు మొదటి సన్యాసి.

"నా పేరు మోహన్ గిరి" నవ్వాడు గాయకుడు.

"నా పేరు కిషన్ బైరాగీ.. సన్యసించి పదేళ్ళయింది" పరిచయం చేసుకున్నాడు మొదటి సన్యాసి (కిషన్ బైరాగి.)

"నేను సన్యాసం తీసుకోలేదుగానీ సన్యాసి కిందే లెక్క."

చిలుము పీల్చే వెలుగులో మోహన్ గిరి నవ్వుని చూశాడు కిషన్.

"అయ్యా.. ఏముందీ? సన్యాసం అనేది కాషాయ బట్టల్లో వుండదు. అది మనసులో ఉద్భవించాలి అని తెలిసింది. అన్నిటినించీ విముక్తి పొందిన వాడే సన్యాసి. కానీ -" ఆగాడు కిషన్ బైరాగి.

"ఊ... చెప్పండి.. అదీ ఇష్టమైతేనే" ప్రోత్సహించాడు మోహన్.

"ఇదీ మనని మనం మోసం చేసుకునే ప్రక్రియల్లో ఒకటి  అని నాకనిపిస్తోంది. ఏదో సాధించాలనే తపనతో ఆశయంతో సన్యాసం స్వీకరించా. ఏమి సాధించాననే ప్రశ్న వేసుకుంటే ఏమీలేదు" నిట్టూర్చాడు కిషన్ బైరాగి. మౌనం గంగతోపాటు ప్రవహిస్తోంది. గంగలో గలగలలు, వారి మనసుల్లో జ్ఞాపకాల తళతళలు.

ఇదో చిత్రమైన వ్యవహారం. చంచలతకీ, నిశ్చలతకీ మధ్యన జరిగే  నిరంతర పోరాటం. ఆలోచనలను అడ్డుకోవాలనే అదుపులేని ఆరాటం.

రాత్రి మెల్లగా నడుస్తూ నడుస్తు వెలుగు తీరాలకి చేరింది. సూర్యుడు నిద్రలేచి డ్యూటీ ఎక్కడానికి సంసిద్ధుడవుతున్నాడు. ఆకుపచ్చ డ్రెస్ వేసుకున్న ఓ ఫకీర్ వాళ్ళిద్దరి ముందుకు వచ్చాడు.

"అల్లామాలిక్" సలాం చేశాడు మోహన్ గిరి.

"ఊ..." ముక్తసరిగా అని కిషన్ బైరాగి వంక చూస్తూ "నీ అసలు పేరు కిషన్ బైరాగి కాదు. కిషన్ బిహారీ. నీది ముర్ఘుఫర్‌పూర్. నీ భార్యాబిడ్డల్ని వదిలేసి పారిపోయావు. అవునా? అన్నాడు.

"ఏం మాట్లాడుతున్నావ్? నేనెందుకు పారిపోతా?" కంగారుగా అన్నాడు కిషన్.

"ఫకీరు ముందు అబద్ధం ఎవరూ ఆడలేరు. కోపంతో మీ వూళ్ళో వాడిని పొడిచి వాడు చచ్చిపోయాడనుకుని పారిపోయి సన్యాసి వేషం వేసుకుని తిరుగుతున్నావు వాడు చావలేదు. బతికే వున్నాడు నీమీద హత్యానేరం పడదులే" నవ్వాడు ఫకీరు.

ధడాల్న ఫకీర్ పాదాలమీద పడ్డాడు కిషన్.

"అయ్యా, ఇవన్నీ మీకెలా తెలుసూ?" తలెత్తి అడిగాడు.

"నా దగ్గర అనేక శక్తులున్నాయి. మీ హిందూ కాఫిర్ల దగ్గరే శక్తులుండగా లేనిది, మా దగ్గర శక్తులుండవా? సరే. నువ్వేం భయపడక్కరలేదు. అయితే ఇప్పుడు మీ యింటికి పోవద్దు అపాయంలో పడతావు. ఆర్నెల్లు ఆగు." ముందుకి కదిలాడు ఫకీర్.

"మీతో నేనూ రావొచ్చా" అడిగాడు కిషన్.

"రా.! అయితే ఆ రుద్రాక్షలూ అవి తీసి పక్కన పారెయ్. నామాలు తుడిచెయ్. బట్టలు నేను ఇస్తాను."

"షాపులు తియ్యరుగా!." సందేహంగా అన్నాడు కిషన్.

"ఫకీర్‌కి అసాధ్యం ఏమీలేదు" అంటూ ఆకాశం వంక చూస్తూ "బిదాసీ.. ఇన్ కో ఖపడాలే ఆవ్" అని ఆజ్ఞ ఇచ్చాడు. దూరం నించి మోహన్ గిరి అంతట్నీ గమనిస్తూనే వున్నాడు. రెండే రెండు నిముషాల్లో టోపీ పెట్టుకున్న ఓ కుర్రాడు ఆకుపచ్చ దుస్తులు తెచ్చి ఫకీర్‌కి ఇచ్చాడు.

"చూశావా నా శక్తి" గంభీరంగా అన్నాడు పకీర్.

"ఈ అబ్బాయి?" అయోమయంగా అన్నాడు కిషన్.

"నా బిదాసీ ఎవర్నయినా వశం చేసుకోగలదు. ఎక్కడ్నించి అయినా, దేన్నైనా తేగలదు. కుర్రాడ్ని వశం చేసుకుని బట్టలు పంపింది" గర్వంగా నవ్వి అన్నాడు ఫకీర్.

"ఆ శక్తి ఎలా..." ఆగాడు కిషన్.

"నువ్వు నా శిష్యరికం చేసి, నాకు నమ్మకం కలిగిస్తే, అప్పుడు నీకు కొన్ని శక్తుల్ని వశపరుచుకునే విధానం నేర్పిస్తా" కిషన్ భుజంతట్టి అన్నాడు ఫకీర్. మహా వినయంగా ఫకీర్‌కి పాద నమస్కారం చేసి, బట్టలు అందుకున్నాడు కిషన్.

"గేలానికి ఓ చేప చిక్కింది" తనలో తను అనుకున్నాడు మోహన్ గిరి.

"ఫకీర్ జీ అక్కడున్న వ్యక్తిని కూడా శిష్యుడిగా చేర్చుకోవచ్చుగా?" మోహన్‌ని చూపించి ఫకీర్‌తో అన్నాడు కిషన్.

"వాడా? వాడు నాకు శిష్యుడిగా పనికిరాడు. పనికిరాని కాఫిర్లని యీ ఫకీర్ దగ్గరకి చేర్చాడు. ముందుకు నడుస్తూ అన్నాడు ఫకీరు.

సూర్యోదయం అవడంతో తూర్పున వున్న కిరణాలు ఫకీర్, కిషన్‌ల వీపులకి తగిలాయి. వాళ్ళ నీడలు పొడుగ్గా పడమర వైపు సాగుతున్నాయి. నడుస్తున్న కొద్దీ. తెల్లవారుఝామునించే మొదలైన, భక్తుల, పండాల, కాటి కాపరుల అలజడి, హడావిడీ, మరింత మరింతగా పెరిగింది. స్నాన ఘట్టాలు మోక్ష ఘట్టాలు స్త్రీపురుషులతో నిండిపోతుండగా మెట్లమీద నించి లేచి మెల్లగా రోడ్డువైపుకి అడుగువేశాడు మోహన్.

సిటీ అఫ్ టెంపుల్స్ సిటీ అఫ్ లైట్స్ సిటీ అఫ్ ఎడ్యుకేషన్ సిటీ అఫ్ ఫిలాసఫీ అని పిలువ బడే కాశీ నగరం భారత ఆధ్యాత్మిక నగరమేగాక, అలౌకిక శక్తులకు కూడలి. 300 సంవత్సరాలు పైగా జీవించిన తెలుగు స్వామి 'త్రిలింగస్వామి'గా మౌనస్వామిగా నివశించిందీ తనువు త్యజించిందీ ఇక్కడే ఒక్కసారి చరిత్రలోకి ఇతిహాసాలలోకి వెడితే హరిశ్చంద్రుడు, బుద్ధుడు, వ్యాసుడు, తులసీదాస్, కబీర్ దాస్, శంకరాచార్యుల వంటి దివ్యులేకాక మున్షీ ప్రేమ్ చంద్, లాల్ బహదూర్ శాస్త్రి పండిట్ రవి శంకర్, బిస్మిల్లా ఖాన్ వంటి కళాకారులూ స్రష్టలూ ద్రష్టలూ కూడా కాశీ నగరంతో జీవితాలు ముడిపడినవారే,

ఈ నగరం ఎప్పటిదో ఎవరూ గుణించలేక పోయారు. భారతీయుల శ్వాసల్లో కాశీ నగరపు ఘోష నిరంతరం వినిపిస్తూనే వుంటుంది. గంగమ్మ తల్లి భారతీయుల శరీరాల్నీ, మనసునీ నిరంతరం పవిత్రం చేస్తూనే వుంటుంది.

"అడుగడుగు నా గంగ - అలుపె ఎరుగని గంగ
ఆర్తిగా మొక్కితే - ఆదరించే గంగ
కరుణతో కన్నీరు - తుడిచివేసే గంగ
పాపాలనన్నిటిని - కడిగి వేసే గంగ
తనువునీ మనసునీ - శుభ్రపరచే గంగ
శ్రద్ధగా కొలిచితే - శాంతినిచ్చే గంగ
గంగమ్మ తల్లికీ - కోటి దండాలు
తలచితే కలుగవా - సకల సంపదలు."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments